సాక్షి మెదక్

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



ఎల్‌ఆర్‌ఎస్‌కు హైడ్రా సెగ

గ్రామీణ ప్రాంతాల్లో వెలిసిన వెంచర్లకు హైడ్రా సెగ తగులుతోంది. ఎల్‌ఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వడంతో అధికారులు దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. వివరాలు 8లో ▸



అడుగుకో గుంత.. నడిచేదెలా?

అసలే అధ్వానంగా ఉన్న రహదారులు.. ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్నాయి. దీంతో జనం అవస్థలు పడుతున్నారు. వివరాలు 9లో ▸



క్లాస్‌లు మిస్ అవుతున్నాం

పాఠశాల సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రతీరోజు క్లాస్‌లు మిస్ అవుతున్నామని విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సమయపాలన తప్పనిసరి



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఈఓ రాధాకిషన్ ఆదేశించారు. బుధవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లు ఉపాధ్యాయులకు న్యాస్, ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, ఏఎంఓ సుదర్శణమూర్తి, రిసోర్స్‌పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రక్షణ కరువు



మాట్లాడుతున్న చంద్రాగౌడ్

నర్సాపూర్: కాంగ్రెస్ పాలనలో సామాన్య పౌరులకు రక్షణ లేకుండా పోయిందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హరీశ్‌రావు, కేటీఆర్‌పై మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు చేసిన వ్యాఖ్యలను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఆయన వ్యాఖ్యలు చూస్తుంటే దాడిని సమర్థించినట్లుగా ఉందన్నారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన నిందితులను ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదని వాపోయారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపుతూ ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు శేఖర్, రామాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, సత్యంగౌడ్, జితేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, శివకుమార్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని, నీటి సరఫరాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామాల వారీగా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర గొప్పది



ర్యాలీ నిర్వహిస్తున్న ఫార్మసిస్టులు

మెదక్ మున్సిపాలిటీ: వైద్యుల తర్వాత ఫార్మసిస్టుల పాత్ర గొప్పదని ఫార్మసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా మెదక్ పట్టణంలోని బస్ డిపో నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేష్, మెదక్ ఏరియా అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, కార్యదర్శి శేషాచారి, కోశాధికారి రాధాకిషన్, కోఆర్డినేటర్ జుబేర్ అహ్మద్, ఫార్మసిస్టులు లక్ష్మీనారాయణ, రమణ, అశోక్, మనోహర్, శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో నలుగురి చేరిక



ప్రిన్సిపాల్‌కు అలాట్‌మెంట్ కాపీని ఇస్తున్న విద్యార్థిని

మెదక్‌జోన్: మెదక్ మెడికల్ కళాశాలలో బుధవారం నలుగురు విద్యార్థులు చేరినట్లు ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు జాతీయ కోటాలో భాగంగా 15 శాతం విద్యార్థులు చేరనున్నట్లు చెప్పారు. కాగా లోకల్ కోటాలో 85 శాతం విద్యార్థులు అక్టోబర్ 12వ తేదీ నుంచి ఆప్షన్ ఎంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. కళాశాలకు ఈ ఏడాది మొదటి విడతలో 50 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు.

కొత్త ఎంఈఓలు వచ్చేశారు

నోడల్ అధికారులకు అదనపు బాధ్యతలు

- 2017 నుంచి పోస్టుల ఖాళీ
- పాఠశాలల్లో కుంటుపడిన పర్యవేక్షణ

జిల్లాలవారీగా నూతన ఎంఈఓలు	
మెదక్	18
సంగారెడ్డి	17
సిద్దిపేట	19

పాపన్నపేట(మెదక్): 'మెదక్ జిల్లా శివ్వంపేట ఎంఈఓ బుచ్యానాయక్‌కు 11 మండలాల అదనపు బాధ్యతలు ఉండేవి. ఆయన శివ్వంపేట నుంచి నారాయణఖేడ్ శివారు ప్రాంతమైన రేగోడ్‌కు వెళ్లి ఒక రోజు మొత్తం తిరిగినా కనీసం మూడు పాఠశాలలు కూడా పర్యవేక్షించలేని పరిస్థితి'. ఇలా ఉమ్మడి జిల్లాలోని అందరి పరిస్థితి అంతే. మెదక్ జిల్లాలో మొత్తం 21 మండలాలు ఉండగా ముగ్గురు ఎంఈఓలు, సంగారెడ్డి జిల్లాలో 28 మండలాలకు 11 మంది, సిద్దిపేటలో 26 మండలాలకు ఏడుగురు ఎంఈఓలు ఉండేవారు. దీంతో పాఠశాలల్లో పర్యవేక్షణ నామ మాత్రమైంది. తాజాగా ప్రతి మండలానికి ఒక ఎంఈఓను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో సర్కార్ బడులు గాడిన పడేందుకు మార్గం సుగమమైంది.

ఎంఈఓల పాత్ర కీలకం

ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో మండల విద్యాధికారుల పాత్ర కీలకం. మధ్యాహ్న భోజనం, బిల్లుల చెల్లింపు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ, టీచర్ల సెలవుల మంజూరు, సర్వీస్ బుక్‌ల నిర్వహణ, నెలవారీ సమావేశాలు, బడిబాట, పాఠశాలల పర్యవేక్షణ తదితర బాధ్యతల నిర్వహణ ఎంఈఓలదే. అయితే పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయుల మధ్య సర్వీస్ రూల్స్ విషయంలో తలెత్తిన వివాదాలు న్యాయస్థానాల వరకు వెళ్లాయి. 2005 నుంచి రెగ్యులర్ ఎంఈఓల ప్రమోషన్లు నిలిచిపోయాయి. 2017లో పంచాయతీ రాజ్ టీచర్లకు ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించవద్దని ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి నుంచి కొత్తవారికి ఎంఈఓ బాధ్యతలు అప్పగించలేదు.



హవేళిఘణాపూర్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న మధుమోహన్

బాధ్యతల స్వీకరణ

ఉన్నవారు బదిలీ కావడం, పదవీ విరమణ చెందడంతో ఆయా మండలాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో ఒక్కో ఎంఈఓకు 5 నుంచి 10 మండలాల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా పాఠశాలల్లో కనీస పర్యవేక్షణ కొరవడింది. దీంతో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, నోడల్ అధికారుల పోస్టులు ఏర్పాటు చేసి కొన్ని బాధ్యతలు వికేంద్రీకరించారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ప్రస్తుతం ఎంఈఓలు లేని చోట మండలాల్లో పనిచేస్తున్న నోడల్ అధికారులందరికీ ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మెదక్ జిల్లాలో కొత్తగా 18 మంది, సంగారెడ్డి జిల్లాలో 17 మంది, సిద్దిపేట జిల్లాలో 19 మంది సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బుధవారం వీరంతా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే మెదక్ జిల్లా మాసాయిపేట, నార్సింగి మండలాల్లో మాత్రం అప్పట్లో హెచ్‌ఎంలు నాట్‌విల్లింగ్ ఇవ్వడంతో స్కూల్ అసిస్టెంట్లను నోడల్ అధికారులుగా నియమించారు. వారికి ప్రస్తుతం అందరిలాగే ఇన్‌చార్జి ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయమై కొంత వివాదం ఏర్పడడంతో వారిని కొంతకాలం ఆగాల్సిందిగా సూచించినట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు.



జల దిగ్బంధంలో ఏడుపాయల

జోరు తగ్గని మంజీరా

పాపన్నపేట(మెదక్): మంజీరా జోరు తగ్గడం లేదు. రెండో రోజు బుధవారం సైతం పరవళ్లు తొక్కుతూ ఏడుపాయల దుర్గమ్మ ఆలయం ఎదుట నుంచి ప్రవహిస్తోంది. సింగూరు నుంచి విడుదల చేసిన 11,461 క్యూసెక్కుల నీరు ఘనపురం ఆనకట్ట మీదుగా పొంగిపొర్లుతూ నిజాంసాగర్ వైపు పరుగులు తీస్తోంది. ఆలయం ఎదుట ఉన్న బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



కామారంలో పర్యటిస్తున్న డీపీఓ యాదయ్య

చిన్నశంకరంపేట(మెదక్): స్వచ్ఛతా హీ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని డీపీఓ యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని మిర్జాపల్లి, కామారం గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రత విషయంలో రాజీపడొద్దని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్మికులకు యూనిఫాం, సబ్బులు, నూనె అందించడంతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. ఆయన వెంట ఎంపీడీఓ దామోదర్, ఎంపీఓ గిరిజారాణి, పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, సుహాసిని ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వందశాతం అక్షరాస్యత సాధించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్: మహిళలు వందశాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా సమాఖ్య 7వ వార్షిక సర్వసభ్య సమావేశం బుధవారం టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించగా.. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 13,063 మహిళా సంఘాల గ్రూపులకు 2024–25 సంవత్సరంలో రూ. 214 కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. తీసుకున్న రుణాలు వినియోగ అవసరాలకు వాడకుండా ఆదాయాభివృద్ధికి వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. అనంతరం 2023– 24 వార్షిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నర్సాపూర్, హవేళిఘనాపూర్, మెదక్ మండలాల అధ్యక్షురాళ్లతో పాటు మండల ఏపీఎంలను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

హవేళిఘణాపూర్(మెదక్): ప్రజలకు ఎంతో ముఖ్యమైన తాగునీటి సరఫరాలో వాటర్‌మెన్‌లు అవగాహనతో వ్యవహరించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. బుధవారం మెదక్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వాటర్‌మెన్‌లకు అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలకు తాగునీరు ఎంతో అవసరమన్నారు. ఇబ్బందులను అధిగమించి తప్పకుండా నీటిని సరఫరా చేయడంలో వాటర్‌మెన్‌లు కీలక పాత్ర వహించాలన్నారు. ఏదైనా సాంకేతికపరమైన అంశాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డీఈ విజయభాస్కర్, పల్లవి, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల మెరుగుకే డ్యూటీ మీట్

అదనపు ఎస్పీ మహేందర్



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: సామర్థ్యాల మెరుగు కోసమే డ్యూటీ మీట్ కార్యక్రమం చేపడుతున్నట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చట్టాల అమలు, అంతర్గత భద్రతా నైపుణ్యం పెంపు, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడంతో పాటు దర్యాప్తులో పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రోత్సహించడమే డ్యూటీ మీట్ లక్ష్యం అన్నారు. జిల్లా పరిధిలోని అధికారులు, సిబ్బంది జోన్ స్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, డీసీఆర్‌బీ సీఐ మధుసూదన్‌గౌడ్, ఎస్బీ సీఐ సందీప్‌రెడ్డి, ఏఆర్ ఎస్ఐ భవానీకుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంపొందించండి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్ రావు

సిద్దిపేటజోన్: సామాజిక బాధ్యతగా తోటివారికి సేవ చేసే అలవాటుతో పాటు పిల్లల్లో మానవీయ విలువలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ట్రెస్మా ఆధ్వర్యంలో గురువందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులపై ఉందన్నారు. ప్రస్తుతం చిన్న పిల్లలు మొబైల్ పట్ల ఆసక్తి పెంచుకుంటున్నారని, పిల్లలను దూరంగా ఉంచేలా తల్లిదండ్రులు, గురువులు పని చేయాలన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో పదో తరగతి ఉత్తమ ఫలితాల్లో టీచర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ఇక్కడి పిల్లలు ప్రపంచ వ్యాప్తంగా దేశవిదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. సమాజహితంగా ప్రయివేటు టీచర్లు సైతం పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, ట్రెస్మా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పత్తికి ముప్పు



కాయపగిలి బయటకు వస్తున్న పత్తి

కొల్చారం(నర్సాపూర్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మంజీరా పరివాహక గ్రామాల్లోని భూములు పత్తి సాగుకు అనుకూలంగా ఉండడం, వరి తర్వాత ఎక్కువ మంది రైతులు పత్తి సాగు వైపు మొగ్గుచూపుతుంటారు. వానాకాలం సీజన్‌లో మండలంలో 2 వేలకు పైగా ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పంట సాగు మొదట్లో పరవాలేదనిపించినా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. మళ్లీ మూడు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షాలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం పత్తికాయ పూర్తిస్థాయిలో పగిలే తరుణంలో ఉంది. అక్కడక్కడ కాయలు పగిలి పత్తి బయటకు కనిపిస్తోంది. వాతావరణం ఇలాగే కొనసాగితే తాము పంటను తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నాందేడ్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా సురేశ్ షెట్కార్



సురేశ్ షెట్కార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాందేడ్ నాయకులు

నారాయణఖేడ్: మహారాష్ట్ర నాందేడ్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ నియమితులయ్యారు. ఆ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలుపొందిన చవాన్ బలవంతరావు ఇటీవల ఆకస్మికంగా మృతిచెందడంతో త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో సురేశ్ షెట్కార్‌ను పార్టీ అధిష్టానం నాందేడ్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించింది. బుధవారం తన అధ్యక్షతన నాందేడ్ లోక్‌సభ పరిధిలోని నాందేడ్ నార్త్, సౌత్, భోకర్, నయాగావ్, డెగ్లూర్, ముఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం దిశానిర్దేశం చేశారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

మెదక్‌జోన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే బీఎస్సీ, బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం పట్టణంలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. చేపపిల్లల పెంపకం గురించి సంబంధిత అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ విశ్వనాథం, వినోద్‌కుమార్, నాగరాణి విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. అప్పులు తీరక!

- 'మన ఊరు– మనబడి' కాంట్రాక్టర్ల ఆవేదన
- చేసిన పనులకు బిల్లులు రాక అవస్థలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో 21 మండలాలు ఉండగా 897 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కొన్ని పాఠశాలలు శిథిలావస్థకు చేరగా, కిచెన్‌షెడ్లు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం మన ఊరు– మనబడి పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాఠశాలలను గుర్తించి విడతల వారీగా మరమ్మతులు చేపట్టింది. జిల్లాలోని అల్లాదుర్గంలో 5, చేగుంట 6, చిలప్‌చెడ్ 7, హవేళిఘనాపూర్ 12, కౌడిపల్లి 8, కొల్చారం 10, మనోహరాబాద్ 7, మాసాయిపేట 3, మెదక్ 6, నర్సాపూర్ 11, నార్సింగి 3, నిజాంపేట 3, పాపన్నపేట 3, రామాయంపేట 4, రేగోడ్ 9, పెద్దశంకరంపేట 4, చిన్నశంకరంపేట 6, శివ్వంపేట 17, టేక్మాల్ 3, తూప్రాన్ 6, వెల్దుర్తిలో 9 పాఠశాలల చొప్పున మొత్తం 142 బడుల్లో పనులు పూర్తి చేయించారు.



ఈ ఫొటోలోని వ్యక్తి పేరు దశరథ్ యాదవ్. మెదక్ మండలం తిమ్మక్కపల్లి గ్రామం. మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు– మనబడి కింద రెండు స్లాబ్‌లు నిర్మించాడు. పనులు పూర్తయిన నెలరోజుల్లోనే మొత్తం బిల్లు వస్తుందని అప్పటి కలెక్టర్ చెప్పడంతో రూ.12 లక్షలు అప్పు తెచ్చి పనులు పూర్తి చేశాడు. పనులు పూర్తయి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి బిల్లు రాలేదు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడం, ఇటు బిల్లులు రాకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై ఆరోగ్యం దెబ్బతిందని చెబుతున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల పథకం' కింద చేస్తున్న పనులకు వెంటనే బిల్లులు ఇస్తుంది. కాని గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం లేదని వాపోతున్నాడు. ఇది ఒక దశరథ్ యాదవ్ ఆవేదనే కాదు. జిల్లాలో మన ఊరు– మనబడి కింద పనులు చేసిన 18 మంది కాంట్రాక్టర్ల ఆవేదన.

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలో చాలా వరకు ఎస్ఎంసీ చైర్మన్లు తమ గ్రామంలోని పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని, నెలరోజుల్లో బిల్లులు వస్తాయని అధికారులు చెప్పడంతో అప్పులు తెచ్చి పనులు చేయించారు. మరికొన్ని పాఠశాలల్లో కాంట్రాక్టర్లు పనులు చేశారు. కాని ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన ఎస్ఎంసీ చైర్మన్లు, కాంట్రాక్టర్లు అప్పుల పాలై అవస్థలు పడుతున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



మాసాయిపేటలో మన ఊరు– మనబడి కింద నిర్మించిన కిచెన్‌షెడ్

రూ.11 కోట్లు రావాల్సి ఉంది

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మనబడి కింద చేసిన పనులకు ఇంకా రూ.11 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. నిధులు రాగానే బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు చెప్పాం.

–రాధాకిషన్, డీఈఓ, మెదక్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్‌ మృతి

- తొమ్మిది రోజులపాటు మృత్యువుతో పోరాటం
- 17న పోలీస్‌ స్టేషన్‌లో డీజిల్‌ పోసుకొని ఆత్మహత్యాయత్నం


విట్టల్‌ (ఫైల్‌)

హత్నూర(సంగారెడ్డి): హత్నూర పోలీస్‌ స్టేషన్‌లో సమీపంలో ఒంటిపై డీజిల్‌ పోసుకొని నిప్పంటించుకున్న ఆటో డ్రైవర్‌ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై సుభాష్‌ కథనం మేరకు.. హత్నూర మండలం మల్కాపూర్‌ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌ పటేల్‌ విట్టల్‌ గౌడ్‌(29) ఈనెల 17వ తేదీ మంగళవారం దౌల్తాబాద్‌ నుంచి ఆటోలో ప్రయాణికుల తీసుకొని మల్కాపూర్‌ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ ఆటో సైడు ఇవ్వలేదని ఇద్దరు డ్రైవర్ల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణ పోలీస్‌ స్టేషన్‌ వరకు వెళ్లడంతో అక్కడే ఆటో డ్రైవర్‌ ఒంటిపై డీజిల్‌ పోసుకొని నిప్పంటించుకున్న విషయం తెలిసిందే. తీవ్రగాయాలతో తొమ్మిది రోజులపాటు గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డున పడ్డ డ్రైవర్‌ కుటుంబం

క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ మృతి చెందడంతో అతడి కుటుంబం రోడ్డున పడింది. రోజూ ఆటో నడుపుకొని కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఒక్కసారిగా అతడి మృతితో కుటుంబానికి ఆసరా లేకుండా పోయింది. విట్టల్‌కు భార్య మౌనికతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం..


పరశురాములు మృతదేహం

కొండపాక(గజ్వేల్‌): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. త్రీ టౌన్‌ ఎస్సై చంద్రయ్య కథనం మేరకు.. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లికి చెందిన పరశురాములు (40) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పని చేయకుండా తిరుగుతున్నాడు. ఇలా ఉంటే సంసారం ఎలా గడుస్తుందంటూ భార్య వాణి మందలించడంతో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. 21న పరశురాములు వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కిరోసిన్‌ పోసుకొని..

దుబ్బాకటౌన్‌ : కిరోసిన్‌ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన బ్లేళ నాగరాజు(45) వెల్డింగ్‌ పని చేస్తూ భార్య సునీత, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అందరూ నిద్రించాక కిరోసిన్‌ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంటలార్పి చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై దుబ్బాక ఎస్సై గంగరాజును వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు హైడ్రా సెగ

చెరువులు, కెనాల్‌ల పక్కన ప్లాట్ల అర్జీలు తిరస్కరణ

- బఫర్‌ జోన్‌ పరిధిలో గుర్తింపు
- వెంచర్లకు ఇరిగేషన్‌ ఎన్‌ఓసీ తప్పనిసరి
- ముగ్గురు సభ్యుల బృందంతో పరిశీలన


హుస్నాబాద్‌ కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌ను సర్వే చేస్తున్న ఇరిగేషన్‌ ఏఈ

హుస్నాబాద్‌రూరల్‌: గ్రామీణ ప్రాంతాల్లో వెలిసిన వెంచర్లకు హైదరాబాద్‌ హైడ్రా సెగ తగులుతోంది. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు మరోసారి అవకాశం ఇవ్వడంతో గ్రామ పంచాయతీలకు వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. గతంలో పంచాయతీరాజ్‌ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులను క్రమబద్ధీకరించారు. హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు పెంచడంతో ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల పరిశీలన కమిటీలో ఇరిగేషన్‌ ఏఈని చేర్చి ప్లాట్ల దరఖాస్తులను విచారించే బాధ్యతలను అప్పగించారు. చెరువు కాల్వలు, కెనాల్‌ కాల్వలు, చెరువుల బ్యాక్‌ వాటర్‌ ప్రాంతాల్లో వెంచర్లు పెట్టి ప్లాట్లు విక్రయించిన దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీ ఇచ్చినప్పటికీ ఇరిగేషన్‌ అధికారులు ఇప్పుడు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

770 ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు

■ హుస్నాబాద్‌ మండలంలో పందిల్ల, పోతారం(ఎస్‌), గాంధీనగర్‌ గ్రామ పంచాయతీ పరిధిలో 770 ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలనకు ఇరిగేషన్‌ శాఖ ఏఈ, రెవెన్యూ శాఖ నుంచి ఆర్‌ఐ, పంచాయతీరాజ్‌ నుంచి ఎంపీఓను పరిశీలన బృందంగా ఏర్పాటు చేశారు. పోతారం(ఎస్‌) శుభం గార్డెన్‌ వెనుక నుంచి గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్‌ కాల్వ రావడంతో అక్కడి వెంచర్లలో కొనుగోలు చేసిన దరఖాస్తులను అధికారులు పక్కన పెడుతున్నారు.

ఆక్రమించి వెంచర్‌కు రోడ్డు

■ పందిల్ల గ్రామంలో వెలిసిన వెంచర్‌ నుంచి కూచనపెల్లి చెరువు నీటి కాల్వ వెల్తుతోంది. దీనిని ఆక్రమించి వెంచర్‌కు రోడ్డు నిర్మాణం చేశారని గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేయగా రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చెరువు కాల్వ ఇరిగేషన్‌కు సంబంధించినది కావడంతో మేం ఎవరికి ఎన్‌ఓసీ ఇవ్వలేదని, ఫిర్యాదులు వస్తే విచారించి పంట కాల్వను తవ్విస్తామని చెప్పడం విశేషం.

ప్లాట్లు చూయించని యజమానులు

హుస్నాబాద్‌, గాంధీనగర్‌, పోతారం(ఎస్‌) సరిహద్దులోని కిషన్‌నగర్‌ వద్ద ఏర్పాటు చేసిన వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారి దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రాంతంలోకి హుస్నాబాద్‌ ఎల్లమ్మ చెరువు బ్యాక్‌ వాటర్‌ వస్తుంది. అలాగే పోతారం(ఎస్‌) ఊర చెరువు మత్తడి వాగు వరద కూడా వస్తుంది. ఇక్కడ మరో వెంచర్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ రెండు వెంచర్లు ఉన్న ప్రాంతాలను ఇరిగేషన్‌శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. వీటిని బఫర్‌ జోన్‌ పరిగణిస్తే తమ ప్లాట్లు పోతాయనే అనుమానంతో యజమానులు అధికారులకు ప్లాట్లు చూయించడం లేదు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకొని ఇప్పుడు అటువైపు కూడా చూడటం లేదు.


హుస్నాబాద్‌ శివారులోని ఎల్లమ్మ చెరువు బ్యాక్‌ వాటర్‌ వచ్చే కిషన్‌నగర్‌ వద్ద ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చెరువుల కాల్వలను రక్షించాలి



గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి అయితే చెరువు, కుంటలకు నీళ్లు వస్తాయి. చెరువుల నుంచి పంటలకు పోయే నీటి కాల్వలను పూడ్చి వెంచర్లు ఏర్పాటు చేస్తే ఇరిగేషన్‌ అధికారులు ఏం చేస్తున్నారు. కొత్త చెరువు ఎఫ్‌టీఎల్‌ ఏది? పందిల్ల వెంచర్‌లో చెరువు కాల్వను కలిపేసి రోడ్డు వేసింద్రు ఇరిగేషన్‌ అధికారులు ఎన్‌ఓసీ ఇవ్వనప్పుడు కాల్వను పూడ్చిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు. ఎల్లమ్మ చెరువు బ్యాక్‌ వాటర్‌ కిషన్‌నగర్‌ వరకు వస్తాయి. పోతారం శివారులో ప్లాట్లను ఎట్లా క్రమబద్ధీకరిస్తారు. ఎఫ్‌టీఎల్‌ హద్దులు పెట్టి, బఫర్‌ జోన్‌ నిర్ణయించాలి. పోతారం చెరువు నుంచి ఎల్లమ్మ చెరువు వచ్చే వాగు ఎక్కడ పోయింది.

– పచ్చిమట్ల రవీందర్‌, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు

ప్లాట్లు చూపించడం లేదు



మా ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు మోకా మీదకు వెళ్లినప్పుడు కొందరు ప్లాట్లు చూపించడం లేదు. మండలంలో మొత్తం 733 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్‌కు పెట్టుకున్నారు. వీరికి సమాచారం ఇస్తే మోకా పైకి రాకపోవడంతో ఆలస్యం అవుతుంది. 45 రోజుల్లో దరఖాస్తులను పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలి. అర్జిదారులు రానప్పుడు తిరస్కరిస్తాం.

– వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ, హుస్నాబాద్‌

కాల్వల పక్కన తిరస్కరిస్తున్నాం

పోతారం(ఎస్‌) గ్రామంలో కెనాల్‌ కాల్వ కోసం సర్వే చేసిన ప్రదేశంలోని వెంచర్‌లో కొనుగోలు చేసిన ప్లాట్ల దరఖాస్తులను తిరస్కరించాం. పందిల్ల, కిషన్‌నగర్‌, గాంధీనగర్‌ ప్రాంతంలో కూడా చెరువు కాల్వలు, వాగుల ఒడ్డున, చెరువు బ్యాంక్‌ వాటర్‌ వచ్చే బఫర్‌ జోన్‌ ప్రదేశంలోని ప్లాట్లను కూడా క్రమబద్ధీకరించడం లేదు. పందిల్ల వెంచర్‌కు మా శాఖ నుంచి ఎన్‌ఓసీ ఇవ్వలేదు, ఫిర్యాదు వస్తే కాల్వలను తవ్వించి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటాం.

– అన్వన్యా, ఏఈ ఇరిగేషన్‌శాఖ, హుస్నాబాద్‌

పారిశ్రామిక వాడలో ట్రాఫిక్‌ నియంత్రణకు కృషి

- ఎస్పీ చెన్నూరి రూపేశ్‌


ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్‌

పటాన్‌చెరు టౌన్‌: పాశమైలారం పారిశ్రామికవాడలో వాహనాల రద్దీ నివారణకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ రూపేశ్‌ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌, పటాన్‌చెరు, బీరంగూడ చౌరస్తాల వద్ద ట్రాఫిక్‌ రద్దీని డ్రోన్‌ వ్యూ ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం స్కూల్‌, కళాశాలల బస్సులు ఉద్యోగస్తుల ప్రయాణాలతోపాటు పరిశ్రమల భారీ వాహనాలు గూడ్స్‌ వెహికల్స్‌ ఒక్కసారిగా రావడంతో ప్రజలు ట్రాఫిక్‌ సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉదయం, సాయంత్రం స్కూల్‌, కళాశాలల బస్సులు వచ్చే సమయంలో పరిశ్రమల వాహనాలను రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, ఎస్‌ఎస్‌ఎస్‌సీ జనరల్‌ సెక్రటరీ సత్యనారాయణ, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌ రెడ్డి, ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ , బీడీఎల్‌ సీఐ స్వామి గౌడ్‌ పాల్గొన్నారు.

గంగాయిపల్లిలో బంగారు విగ్రహాలు లభ్యం?

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల పరిధిలోని గంగాయిపల్లి అటవీ ప్రాంతంలో దేవతామూర్తుల బంగారు విగ్రహాలు లభ్యమైనట్లు తెలిసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్నారు. గంగాయిపల్లికి చెందిన ఓ కూలీ పదిరోజుల కిందట అటవీ ప్రాంతంలో తవ్వకాలు చేస్తుండగా దేవతామూర్తుల విగ్రహాలతోపాటు శఠగోపం లభ్యమైనట్లు ప్రచారం జరుగుతోంది. తవ్వకాల్లో బయటపడిన విగ్రహాల గురించి సదరు కూలీ ఫీల్డ్‌ అసిస్టెంట్‌ శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మాత్రం తనకు తెలియదని చెబుతున్నారు.

ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

- మర్కూక్‌ మండలం పాతూరు గ్రామంలో ఘటన


అనిల్‌ (ఫైల్‌)

మర్కూక్‌(గజ్వేల్‌): ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని భయంతో పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా మర్కూక్‌ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాతూరు గ్రామానికి చెందిన ఈరన్న అనిల్‌కుమార్‌(19) పదవ తరగతి పూర్తి చేసి గ్రామంలోనే వ్యవసాయ పనులు చేస్తున్నాడు. సొంత గ్రామంలోనే వరుసకు మేనమామ కూతురితో ఏడాది కాలంగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. ఇద్దరి ప్రేమ విషయం తెలుసుకున్న అనిల్‌ తల్లిదండ్రులు 21న అమ్మాయి ఇంటికి వెళ్లి మాట్లాడారు. మరుసటి రోజు అమ్మాయి మేనమామలు నర్సింలు, శేఖర్‌ అనిల్‌ ఇంటికొచ్చి మా కోడలితో ప్రేమ కొనసాగిస్తే చంపేస్తామని బెదించారు. దీంతో భయపడిన యువకుడు ప్రేమించిన అమ్మాయి దక్కదేమోనని మనస్తాపంతో 23న గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గాంధీకి తరలించారు. అక్కడి నుంచి ములుగులో ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ దామోదర్‌ తెలిపారు.

చెక్‌ డ్యాంలో దూకి..


శివకుమార్‌ (ఫైల్‌)

అల్లాదుర్గం(మెదక్‌): చెక్‌ డ్యాంలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చేవెళ్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెన్న శివకుమార్‌(30) సంగారెడ్డిలోని శ్రీరామ్‌ చిట్‌లో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో కొంత నగదు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని కార్యాలయ సిబ్బంది ఇటీవలె ఇంటికొచ్చి అడిగారు. 23వ తేదీన శివకుమార్‌ సంగారెడ్డికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని చెక్‌డ్యాంలో మృతదేహం తేలడాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. బైక్‌, చెప్పులు, ఫోన్‌ చెక్‌ డ్యాం ఒడ్డుపై ఉన్నాయి. కార్యాలయంలో తీసుకున్న డబ్బులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి అన్న అంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మనస్తాపంతో యువకుడు..


వంశీ (ఫైల్‌)

తూప్రాన్‌: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూప్రాన్‌ మండలంలోని ఘనపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన జంగం వంశీ(18) 21న గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనేందుకు మద్యం సేవించి వెళ్తున్నాడు. అక్కడికి వెళ్లడానికి తల్లి బాలమణి అడ్డు చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన వంశీ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి మేడ్చల్‌ జిల్లాలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి బానిసై..


బాబు(ఫైల్‌)

శివ్వంపేట(నర్సాపూర్‌) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పడిగే బాబు(35) ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. గకొంతకాలంగా మద్యానికి బానిసై ఇంట్లో గొవడపడుతూ ఉన్నాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికొచ్చి భార్యతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో నుంచి వెళ్లిపోయి గ్రామ శివారులో ఉన్న పిల్లి గుండ్ల మత్తడి చెక్‌ డ్యాం దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, ఫైర్‌ ఇంజన్‌ సిబ్బంది చెక్‌ డ్యాంలో బుధవారం ఉదయం వెతకగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

బగలాముఖీ ఆస్థాన సంగీత విద్వాంసులుగా రామాచారి

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం ఆస్థాన సంగీత విద్యాంసులుగా మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు రామాచారిని నియమించినట్లు ఆలయ వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ బుధవారం తెలిపారు. రామాచారి శివ్వంపేటలో పుట్టి, పెద్దగొట్టిముక్లలో పెరిగి ఈరోజు లిటిల్‌ మ్యుజిషియన్స్‌ అకాడమీ స్థాపించి ఎందరో బాలబాలికలను గాయకులుగా తయారు చేశారన్నారు. అలాంటి వ్యక్తి కిన్నెర, బాలు పురస్కారం లభించడం మండల ప్రజల అదృష్టమని శాస్త్రుల వెంకటేశ్వరశర్మ అన్నారు.


రామాచారి దంపతులను సన్మానిస్తున్న వెంకటేశ్వరశర్మ

పొలంలో పడి ఊపిరాడక రైతు మృతి

గట్టుపై నడుస్తుండగా ప్రమాదం


రమేశ్‌ మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్‌): పొలంలో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలంలో బుధవారం చోటు చేసుకుంది. శాలిపేట గ్రామానికి చెందిన బుస్స రమేశ్‌ (45) ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పొలంలో పడిపోయి ఉన్నాడు. బయటికి తీసి చూడగా అప్పటికే చనిపోయాడు. పొలం బురదలో పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు భార్య మైసమ్మ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

చెరువులో స్నానానికి వెళ్లి..


శ్రీనివాస్‌(ఫైల్‌)

పెద్దశంకరంపేట(మెదక్‌): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట తిరుమలాపూర్‌ చెరువులో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సునీత కథనం మేరకు.. పట్టణానికి చెందిన అవుసుల శ్రీనివాసచారి(58) మంగళవారం పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం స్థానిక చెరువులో మృతదేహమై తేలడంతో స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్నానం చేయడానికి చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడని మృతుడి కుమారుడు మహేశ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గేదెలను మేపేందుకు వెళ్లి..

పటాన్‌చెరు టౌన్‌ : గేదెలను మేపేందుకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌ రెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జాటి పటేల్‌(36) భార్య సంజుక్తతో కలిసి బతుకుదెరువు కోసం జిన్నారం వచ్చాడు. స్థానికంగా ఉండే అశోక్‌కు చెందిన గేదెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. 24న ఉదయం గేదెలను మేపేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. జాటి పటేల్‌ కోసం కుటుంబ సభ్యులు బుధవారం వెతుకుతుండగా అన్నారం గ్రామ శివారులో డంప్‌యార్డు వద్ద మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గేదెలను మేపేందుకు వెళ్లినప్పుడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో పిడుగుపడి మృతి చెంది ఉండొచ్చని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జాతీయ రహదారిపై కారు పల్టీ

- ఆరుగురు ఉపాధ్యాయులకు గాయాలు
- విధులకు వెళ్తుండగా ప్రమాదం


ప్రమాదంలో బోల్తా పడిన కారు

వట్‌పల్లి(అందోల్‌): కారు అదుపుతప్పి పల్టీకొట్టడంతో ఆరుగురు ఉపాధ్యాయులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని మాసానిపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అందోలు మండల పరిధిలోని నేరడిగుంట, అక్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు బీహెచ్‌ఈఎల్‌, పటాన్‌చెరు ప్రాంతాల నుంచి ప్రతీ రోజు ప్రైవేట్‌ కారులో విధులకు వెళ్తుంటారు. రోజు మాదిరి బుధవారం ఉదయం కారులో వెళ్తుండగా సంగుపేట వద్ద ఉన్న హైవే రోడ్డు బ్రిడ్జిపైకి ఎక్కి అదుపుతప్పి పక్కనే ఉన్న ఫెన్సింగ్‌ వైరును దూసుకొని సర్వీస్‌రోడ్డుపై పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయురాలు వరలక్ష్మి, జ్యోతి రత్నకుమారికి తీవ్ర గాయాలు అయ్యాయి. వాహన డ్రైవర్‌ ప్రవీణ్‌తోపాటు ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, రాంచెందర్‌, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణకి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.మాణయ్య, నాయకులు నరోత్తం, రాజమల్లు, తదితరులు ఉపాధ్యాయులను పరామర్శించారు.

బైక్‌ ఢీకొని మహిళ..

సిద్దిపేటకమాన్‌: బైక్‌ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్‌ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్‌ మహేశ్వరి (50) బీడీ వర్కర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. బుధవారం ఉదయం పని నిమిత్తం బయటకు వెళ్తూ రేణుకానగర్‌ వద్ద మెయిన్‌ రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి అక్షయ్‌ అనే యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన మహిళను స్థానికులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి కుమారుడు భానుప్రసాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


స్నేహితురాలి పుట్టిన రోజుకు వెళ్లి వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థిని మృతి


నాగలక్ష్మి(ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యార్థిని మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం పన్యాల గ్రామానికి చెందిన నాగలక్ష్మి(18) ఇంటర్‌ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకకు తన సోదరుడు నాగరాజుతో కలిసి కూకట్‌పల్లికి వెళ్లింది. సాయంత్రం బైక్‌పై తిరిగొస్తుండగా రుద్రారం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సోదరుడు నాగరాజుకి స్వల్ప గాయాలు కాగా బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం ఢీకొని యువకుడు


ప్రమాద స్థలంలో మల్లేశం

హవేళిఘణాపూర్‌(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఫరీద్‌పూర్‌ గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్‌ మండలం మక్తభూపతిపూర్‌ గ్రామానికి చెందిన కర్రొల్ల మల్లేశం(25), కొల్చారం మండలం కొంగోడ్‌కు గ్రామానికి చెందిన మేకల ఎల్లం హవేళిఘణాపూర్‌ మండలం ఫరీద్‌పూర్‌లో బంధువుల చావుకు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్నారు. ఫరీద్‌పూర్‌ గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందగా ఎల్లంకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఏఎస్‌ఐ రాజు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో

– ఒకరు మృతి

హవేళిఘణాపూర్‌(మెదక్‌): ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టడంతో డ్రైవర్‌ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్‌ మండలం చిన్నచింతకుంటకు చెందిన నరేశ్‌ గౌడ్‌(35) ఆటో నడుపుకుంటూ రామాయంపేట వైపు నుంచి వస్తున్నాడు. ఔరంగాబాద్‌ తండా శివారులోకి రాగానే రోడ్డుపక్కన ఆగి లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నరేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి దుర్గాగౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్‌ ఏఎస్‌ఐ శివకుమార్‌ తెలిపారు.

వరదలో బైక్‌తోసహా ఒకరి గల్లంతు

- మరొకరిని కాపాడిన గ్రామస్తులు
- సంగారెడ్డి జిల్లా బూచినెల్లిలో ఘటన


వరదలో కొట్టుకుపోతున్న షాకీర్‌


షాకీర్‌

జహీరాబాద్‌ టౌన్‌: వాగు దాటుతుండగా వరద తాకిడికి ఇద్దరు వ్యక్తులు కొట్టుకుపోగా.. వారిలో ఒకరు గల్లంతయ్యారు. మరొకరిని గ్రామస్తులు రక్షించారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌ మండలం బూచినెల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం బీదర్‌ పట్టణంలోని మైలూర్‌కు చెందిన ఇస్మాయిల్‌ ఖాదీర్‌(65), షాకీర్‌(40) స్నేహితులు. షాకీర్‌ హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇద్దరు సొంతూరులో కలుసుకున్నారు. అయితే.. షాకీర్‌ బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరుతుండగా.. జహీరాబాద్‌లో ఉంటున్న తన సోదరి కలిసేందుకు ఇస్మాయిల్‌ ఖాదీర్‌ అదే బైక్‌పై ఇద్దరు కలిసి బయలుదేరారు. బూచినెల్లి గ్రామ శివారు గుండా ప్రవహించే నారింజ వాగు దాటుతుండగా వరద తాకిడికి ఇద్దరు కొట్టుకుపోయారు. ఖాదిర్‌ ముళ్లపొదలను పట్టుకోగా.. షాకీర్‌ బైక్‌తో సహా కొట్టుకుపోయాడు. ముళ్లపొదలను పట్టుకొని ఉన్న ఖాదిర్‌ను గమనించిన గ్రామస్తులు రక్షించారు. తహసీల్దార్‌ రవీందర్‌, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.